ఆదుకోని అపరాలు

- మెట్టలో గణనీయంగా తగ్గిన దిగుబడి
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



జగన్నాథపురంలో అపరాల పంట నూర్పిడి చేస్తున్న రైతులు

కోటనందూరు: తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు సాధించే అపరాల సాగు ఈ ఏడాది నిరాశకు గురిచేసింది. రైతులు పండించిన మినుము, పెసర దిగుబడి మార్కెట్‌లో సరైన ధర లభించకపోగా దిగుబడి గణనీయంగా పడిపోయాయి. పండిన అపరాలు అమ్మితే కనీసం కూలీలకు అవసరమైన డబ్బులు కూడా రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట ఆది నుంచి అనుకూల వాతావరణం లేకపోవడం, ప్రతికూల పరిస్థితుల్లో పైరుపై తీవ్ర తెగుళ్ల ప్రభావం చూపడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో అపరాలకు కనీస గిట్టుబాటు ధర లభించకపోగా మార్కెట్లో దళారుల ప్రభావం పెరిగిపోయింది.

ఇదీ పరిస్థితి

తుని సబ్‌డివిజన్ పరిధిలో ఈ ఏడాది రబీలో 10,318 ఎకరాల్లో పెసర, 9,785 ఎకరాల్లో మినుము సాగు చేశారు. వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాల ద్వారా ఎకరాకు మినుములు ఒకటిన్నర కింటాళ్లు, పెసర రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చినట్టు గుర్తించారు. ఇప్పటికే రైతులు 90 శాతం పంటను ఒబ్బిడి చేసుకోగా ఆలస్యంగా కోతకొచ్చిన 10 శాతం పంట దిగుబడిని ఒబ్బిడి చేసుకునే పనిలో ప్రస్తుతం రైతులు నిమగ్నమయ్యారు.

రైతులకు దక్కని మద్దతు ధర

రైతులు రబీలో సాగు చేసిన అపరాలకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించడం లేదు. గతంలో మాదిగానే దళారీ చెప్పిందే వేదం. అతను నిర్ణయించిందే ధర. దళారీ మాటకు కట్టుబడే రైతు అపరాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి మళ్లీ వచ్చింది. గత ప్రభుత్వం దళారుల ఆగడాలకు కళ్లెం వేసింది. రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం అపరాల రైతులను పెద్దగా పట్టించుకోలేదు.

అక్కరకు రాని కొనుగోలు కేంద్రం

కోటనందూరు–1 రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వపరంగా అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 22న ప్రారంభించారు. పెసరకు రూ.8,682, మినుముకు రూ. 7400 ధర(ఎంఎస్‌పీ)గా నిర్ణయించినట్లు ప్రకటనలు చేశారు. ప్రభుత్వం విధించే అనేక ఆంక్షలతో అపరాలకు కనీస మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. అయితే ఇప్పటికే దాదాపు రైతులంతా అపరాలను బయట మార్కెట్లో అమ్మేసుకున్నారు. ప్రభుత్వం కంటితుడుపు చర్యగా అపరాల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ప్రస్తుతం మార్కెట్లో పెసర రూ.6,500, మినుము రూ.6,300 మాత్రమే పలుకుతుంది.



అపరాల సాగులో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఉరుకులు, పరుగులు

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా మెట్ట ప్రాంతంలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో అపరాల రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కొంత మంది రైతులు పొలాల్లో ఉన్న పంటను ఒబ్బిడి చేస్తుంటుండగా మరికొంత మంది ఒబ్బిడి చేసిన పంటను సురక్షిత ప్రాంతాలకు చేరుస్తున్నారు. అల్పపీడన ప్రభావ తీవ్రతను వాతావరణశాఖ ముందస్తుగా తెలియజేయడంతో రైతులు అప్రమత్తంగా వ్యవహరించి తుపాను ముప్పు నుంచి బయట పడేందుకు యత్నిస్తున్నారు.

అపరాల రైతుకు కష్టమే మిగిలింది



ప్రతికూల వాతావరణంలో ఈ ఏడాది అపరాల దిగుబడులు భారీగా పడిపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌లో మినుము, పెసర రేటు భారీగా తగ్గిపోయింది. రైతులు దాదాపు అపరాలన్నీ బయట మార్కెట్లో అమ్మేసుకున్న తరువాత ప్రభుత్వం ఇప్పుడు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. దీంతో రైతులకు కలిగే ప్రయోజనం ఏంటి. అపరాలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. కంటికి రెప్పలా కాపాడిన పంట ఒబ్బిడి చేసిన తరువాత కేవలం కష్టం మాత్రమే మిగిలింది.

– **అప్పలనాయుడు**, రైతు, చిన్నయ్యపాలెం

ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట



తంటికొండలో నేలకొరిగిన వరి పంట పరిశీలిస్తున్న రైతులు

గోకవరం: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. గోకవరం, తంటికొండ, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో వరి పంట, రంపయర్రంపాలెం, కొత్తపల్లి, కామరాజుపేట, గంగంపాలెం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో రైతులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అకాల వర్షాలకు మండలంలో 830 ఎకరాల్లో వరి, 280 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు ఏఓ రాజ రాజేశ్వరి తెలిపారు. అలాగే మామిడి పిందెలు సైతం రాలిపోవడంతో రైతులు దిగాలు చెందారు.

జగ్గంపేటలో వర్షం

అక్కడక్కడ వడగళ్లు

జగ్గంపేట: మండలంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కారుమబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లగా మారిపోయింది.కొద్ది సేపు వర్షం పడింది. గ్రామంలో పలుచోట్ల వడగళ్లు పడ్డాయి.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తుని: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని తుని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తుని జీఎన్‌టీ రోడ్డు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌ను ఎలా పాటించాలో వివరించారు. వాహన చోదకులు జంక్షన్లో ఏ విధంగా నడుచుకోవాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ముఖ్యంగా హెల్మెట్ ధారణ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎస్సై విజయ్‌బాబు, ఏఎస్సై రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసత్యదేవా టెంట్‌హౌస్ నూతన కార్యవర్గం



టెంట్‌హౌస్ వర్తక వ్యాపార సంఘం కార్యవర్గం

ఏలేశ్వరం: శ్రీసత్యాదేవా టెంట్‌హౌస్ వర్తక వ్యాపారుల సంఘం నూతన కార్యవర్గాన్ని పట్టణంలో మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయ కల్యాణమండపంలో కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గూడవిల్లి అర్జునరావు, ఉపాధ్యక్షుడిగా కోన బాబు, కార్యదర్శిగా గూడుపు కృష్ణ, సహాయ కార్యదర్శిగా జి.కృష్ణమోహన్, కోశాధికారిగా బసా దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ తమ సంఘం తరుపున మెరుగైన సేవలు అందిస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ ఫార్మాడి విద్యార్థులకు వరల్డ్ టీబీ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందు ఉపయోగించే విధానం, పౌష్టికాహారం తీసుకోవాలని జీఎస్ఎల్ హాస్పటల్ నందు రోగులకు వివరించినట్టు తెలియజేశారు.

పాలసీ జీవితానికే భరోసా

శంఖవరం: మనం చేయించుకున్న పాలసీలే మనకు ఆపద సమయంలో భరోసాగా నిలుస్తాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.సునీల్ అన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్‌లో మంగళవారం ఇటీవల ప్రమాదంలో మరణించిన రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన కొల్లు లోవ సత్తిరాజు కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో భాగంగా రూ.2 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఆర్థిక భద్రతకు బీమా తప్పనిసరిగా అవసరమవుతుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ ప్రతాప్ పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు 'నవోదయం'

ప్రత్తిపాడు: సారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం చేపడుతున్నట్టు కాకినాడ జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ కె.జయమౌనిక తెలిపారు. లంపకలోవ గ్రామంలో మంగళవారం సాయంత్రం సారా, ఇతర ఎక్సైజ్ నేరాల నిర్మూలనకు నవోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్, ఎస్సై వంశీరామ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ

తుని: పురపాలక సంఘం పరిధిలోని భవనాలు, ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెల 31లోగా చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని కమిషనర్ వెంకట్రావు మంగళవారం తెలిపారు. నిబంధనల ప్రకారం మొదటి ఆర్థిక సంవత్సరానికి జూన్ నెలాఖరులోపు, రెండో విడత డిసెంబరు నెలాఖరు 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉందన్నారు. పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు పేరుకుపోయిన బకాయిలు వసూళ్ల మెరుగు కోసం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

పర్యావరణానికి హాని కలిగ్గిస్తే చర్యలు

రౌతులపూడి: అటవీ భూముల్లో చొరబడి పర్యావరణానికి హాని కల్గిస్తే చట్టపరమైన చర్యలుంటాయని సీసీఎఫ్(చీఫ్ కన్జర్వేట్ ఆఫ్ పారెస్టు) బీఎస్ఎస్ మూర్తి, డీఎఫ్ఓ రవీంద్రనాథ్ చౌదరి అన్నారు. మండలంలోని ఉప్పంపాలెం-అనంతారం అటవీ భూములను మంగళవారం వారు పరిశీలించారు. ఉప్పంపాలెం-అటవీభూముల్లో ఒక క్వారీ నిర్వాహకులు అటవీ భూములు ఆక్రమించారంటూ వచ్చిన ఫిర్యాదుపై పరిశీలించినట్టు అధికారులు తెలిపారు. స్క్వాడ్ డీఎఫ్ఓ టి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు రాని హాల్ టిక్కెట్లు

జగ్గంపేట: గ్రామంలో ఆంధ్రాయూనివర్సిటీకి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలు మొదలయ్యాయి. అయినా హాల్ టిక్కెట్లు రాకపోవడంతో ఈ అకడమిక్ ఇయిర్ వృథా అవుతుందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ కొన్ని సాంకేతిక సమస్యలు వల్ల మొదటి రోజు హాల్ టిక్కెట్లు రాలేదని అన్నారు . యూనివర్సిటీతో మాట్లాడామని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

నాణ్యమైన విద్యాపై అంగన్‌వాడీలకు శిక్షణ



రౌతులపూడిలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

రౌతులపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే విద్యా విధానాన్ని మెరుగు పరిచేందుకు నూతన శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టామని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి అన్నారు. మిషన్ పోషన్-2.0, సాక్ష్యం అంగనవాడీ కార్యక్రమంలో భాగంగా పోషణ్-బి, పడాయి-బి కార్యక్రమాలపై మూడు రోజులు పాటు శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈసీసీఈ, నవచేతన(ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు), ఆదర్శశీల(మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులు వరకు) పిల్లలకు అందించే విద్యాబోధనలో నాణ్యతను పెంపొందించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టామని సీడీపీఓ అన్నారు. అంగనవాడీ టీచర్లు అంతా మంచి శిక్షణ పొంది చిన్నారులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ టీచర్లు రత్నకుమారి, రాజేశ్వరి, సత్యవేణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: వి.కొత్తూరులోగల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆరు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ బాలికలు, బడి బయట బాలికలు, బడిమానేసిన విద్యార్థినులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన బీపీఎల్ కుటుంబాలలో బాలికలు ప్రవేశాలకు అర్హులన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ చేసినట్టు ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 8978959678 నంబరుకు సంప్రదించాలన్నారు.

కేజీబీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్(ఎంపీహెచ్‌డబ్ల్యూ)లో బాలికల ప్రవేశానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ రాజేశ్వరి మంగళవారం తెలిపారు. ఆరవ తరగతిలో 40, ఇంటర్మీడియెట్‌లో 40 ఖాళీలు ఉన్నాయన్నారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.మరిన్ని వివరాలకు 94921 77544 నంబరును సంప్రదించవచ్చన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



చంద్రిక



వత్స



అక్షయకుమార్

కోటనందూరు: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో పాత కొట్టాం ఎంపీపీఎస్‌కు చెందిన బత్తిన చంద్రిక, కొత్త కొట్టాం ఎంపీపీ స్కూలు విద్యార్థి అడిగర్ల వత్స, కేఓ అగ్రహారం ఎంపీపీ స్కూలు విద్యార్థ/ మిరియాల అక్షయకుమార్ ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు ఎంఈఓ రామశేఖర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నవోదయకు ఎంపికైన ఆరుమంది విద్యార్థులు

తొండంగి: మండలంలోని ఆరుగురు విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారు. శృంగవృక్షానికి చెందిన వర్షిణి, కె.వెంకట చంద్రమౌళి, పంపాదిపేటకు చెందిన పునీతేశ్వరి, తొండంగికి చెందిన అభి, పాతచోడిపల్లిపేటకు చెందిన చందక మురళీ కృష్ణ వై.వైష్ణవి ఇటీవల నిర్వహించిన నవోదయ ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి అర్హత పొందారు. ఈ సందర్భంగా ఎంపికైన వారిని వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

పొలంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోండి



పాండవులపాలెంలో మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు లక్ష్మీ

ప్రత్తిపాడు రూరల్: తన పొలంలోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాండవులపాలెం గ్రామానికి చెందిన ఇరటా లక్ష్మ జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పాండవులపాలెంలో ఆమె మీడియాతో మాట్లాడారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అడ్డాల వీరన్న, అడ్డాల సూర్యారావు తన పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలంలోకి వెళ్లకుండా అడ్డుకు పడుతున్న వారి చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదని ఆందోళన చెందారు. దీనిపై జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఇరటా శిరిషా, రెల్లి సత్యనారాయణ, ఇరటా శివ, అడ్డాల నరసింహమూర్తి, ఒనుగుల సీతయ్య , కర్రి నాగేశ్వరరావు, రేచుకట్ల రాంబాబు, సోమాల శ్రీను, కురిపల్లి శ్రీను, రెల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు ప్రతి రైతు బాధ్యత

- డీపీఎం ఎలియాజర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎలియాజర్

ప్రత్తిపాడు: ప్రస్తుతం రసాయన వ్యవసాయం వల్ల పెద్ద ప్రమాదంలో ఉన్నామని, దీన్ని నుంచి బయట పడేందుకు ఏకైక మార్గం ప్రకృతి వ్యవసాయమేనని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ అన్నారు. ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయాన్ని బాధ్యతగా చేపట్టాలని ఆయన కోరారు. ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాయలంలో మంగళవారం ప్రకృతి సాగు చేపట్టే రైతులకు 2025–26 ఖరీఫ్ ప్రణాళికను రూపొందించేందుకు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన డీపీఎం ఎలియాజర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో జరిగే కేపీపీ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రతీ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసేటట్టు ప్రతీ రైతును ప్రోత్సహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జగ్గంపేట వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్, ఏపీఎం వై వెంకట్, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఎం కుమారస్వామి, ఎంటీఎల్ రాకేష్ శర్మ, మాస్టర్ ట్రైనీలు మూరా చినబాబు, రామరాజులతో పాటు వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకించిన నిర్వహణ కమిటీలు



పాఠశాల విలీనంపై ఎస్ఎంసీ సభ్యుల అభిప్రాయ సేకరణ చేస్తున్న ఎంఈవో షేక్‌బాబ్జి

తొండంగి: ప్రభుత్వం ప్రైమరీ స్కూళ్లలో మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కలిపేందుకు క్షేత్రస్థాయిలో పాఠశాల నిర్వహణ కమిటీలు దాదాపు పూర్తిగా వ్యతిరేకించాయని ఎంఈవో షేక్‌బాబ్జి తెలిపారు. మండలంలోని 44 ప్రైమరీ స్కూళ్లు, ఎనిమిది యూపీ స్కూళ్లు, 11 హైస్కూళ్లు ఉన్నాయి. కాగా 3,4,5, తరగతులను సమీపంలో మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కలిపేందుకు 13 స్కూళ్లను ఎంపిక చేశారు. ఈమేరకు విద్యాశాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల ప్రకారం కొద్ది రోజులుగా పాఠశాలల్లో నిర్వహణ కమిటీలను ఒప్పించేందుకు సర్వే చేస్తున్నారు. ఈనేపథ్యంలో మొదటి విడతగా 13 పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు పూర్తిగా వ్యతిరేకించారని ఎంఈవో తెలిపారు. కాగా రెండో దఫా కూడా అభిప్రాయ సేకరణ చేయగా పైడికొండ బీసీ కాలనీ ప్రైమరీ స్కూలు కమిటీ ఒప్పుకోగా మిగిలిన 12 స్కూలు కమిటీలు పూర్తిగా వ్యరేకించాయన్నారు. మరో దఫా కూడా అభిప్రాయ సేకరణ చేయనున్నట్టు వివరించారు.

తామర పురుగు నివాణకు తగు చర్యలు తీసుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: తామర పురుగు నివారణకు రైతులు తగు చర్యలు చేపట్టాలని ప్రభావంతో పుష్పగులకు నష్టం వాటిల్లుతుందని రామచంద్రపురం ఎస్‌కేపీపీ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చిన్నబ్బాయి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో స్థానిక ఉద్యానవన శాఖ అధికారి శ్రీవల్లీతో కలిసి మామిడి పంటను పరిశీలించారు. మామిడిలో నల్ల తామర పురుగు వల్ల పుష్పగుచ్ఛలకు నష్టం వాటిల్లుతుందని గుర్తించారు. దీని నివారణకు మిథైల్ యూజినాల్ యుజునల్, మోనోక్రోటోఫాస్ కలిపిన ఎరను ఉంచాలని సూచించారు. ఫిప్రోనిల్ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు లేదా లీటర్ నీటికి సయంత్రినిలిపోల్ 1.8మిల్లీలీటరు లేదా థయోమెత్తక్సం థయో మిథాక్సం 0.3 గ్రాములు ఒక లీటరు నీటికి లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీ లీటరు నీటికి చొప్పున కలిపి పంటపై పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు గణేష్, రైతులు బొండు శ్రీనివాసరావు, దేప రమణ పాల్గొన్నారు.

మామిడిలో తామర పురుగు నివారణ చర్యలు చేపట్టండి

జగ్గంపేట: మామిడి తోటలలో తామర పురుగు అధికంగా ఉందని దీని నివారణకు తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రామచంద్రపురానికి చెందిన ఉద్యానశాఖ శాస్త్రవేత్త సీహెచ్ చిన్నబ్బాయి తెలిపారు. రాజపూడి గ్రామంలో మామిడితోటలను ఆయన మంగళవారం స్థానిక ఉద్యానశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. జగ్గంపేట ఉద్యానశాఖ అధికారి లావణ్య,రాజపూడి విహెచ్ఎ కృష్ణంరాజు,మామిడి రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దార సూరరాజు ఇటీవల చేతికి ఆపరేషన్ చేయించుకున్నాడు. వారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముమ్మిడి వీరబాబు, మిత్తన వీరబాబు, గంట గంగబాబు, ఉలిశెట్టి బుజ్జి, రామిశెట్టి దొరబాబు, గంట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు

జగ్గంపేట: జె.కొత్తూరు వద్ద ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు మోటారు సైకిల్‌పై నిర్లక్ష్యంగా వస్తున్న వ్యక్తిని తప్పించబోయి పక్కనే వున్న తుప్పలలోకి వెళ్లింది. బస్సులో ఉన్న విద్యార్థులను స్థానికులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. విద్యార్థులంతా క్షేమంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు వెళ్లిన ప్రదేశంలో విద్యుత్ స్తంభం ఉండడంతో ఆగింది.

గిరిబాబును కలిసిన పాండవులపాలెం గ్రామస్తులు



కిర్లంపూడిలో గిరిబాబును కలిసిన గిరిజనులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కిర్లంపూడిలోని ఆయన నివాసంలో పాండవులపాలెం గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయనను కలిసిన వారిలో ఇరటా లక్ష్మీ, రెల్లి సత్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు, ఇరటా శివ, అడ్డాల నరసింహమూర్తి, ఒనుగుల సీతయ్య, రేచకట్ల రాంబాబు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలు బోధనాశక్తిని పెంచుకోవాలి



తునిలో శిక్షణ గ్రూప్ చర్చలను పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్లు

తుని రూరల్: పిల్లల సమగ్ర అభివృద్ధి అంగన్‌వాడీ కార్యకర్తల కీలకపాత్ర వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. పోషన్ బీ - పడాయి బీపై బ్యాచ్-2 అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో విడత మూడు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. 0–6 నెలల పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి మహిళ, స్త్రీ శిశు సంక్షేమశాఖ రూపొందించిన కార్యక్రమంలో నవచేతన, ఆదర్శ శీల, దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణలపై అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని సీడీపీఓ శ్రీలత పేర్కొన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని బోధనాశక్తిని పటిష్టం చేసుకోవాలన్నారు. పిల్లల్లో అభ్యాసన శక్తి పెంపొందించాలని, పౌష్టికాహారం, ఆరోగ్యంపై శ్రద్ధ కలిగించాలన్నారు. ఐసీడీఎస్, ఎంపీడీఓ కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణకు హాజరయ్యారన్నారు. గ్రూప్ చర్చలను సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. ఏసీడీపీఓ నిహారిక, సూపర్‌వైజర్లు సరస్వతి, రమణమ్మ, విజయలక్ష్మి, కృష్ణకుమారి, వాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య అందించాలి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ కోరారు. మిషన్ పోషణ్ 2.0 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే పోషన్ బీ - పడాయి బీ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, వెలుగు ఏపీఎం వై వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



మహాసభలో ప్రసంగిస్తున్న లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు

ప్రత్తిపాడు: సూపర్ సిక్స్ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు దుయ్యబట్టారు. ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆపార్టీ మండల మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ అబద్దపు హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు చేయాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 28న తలపెట్టిన ×చలో ప్రత్తిపాడు×ను విజయవంతం చేయాలని లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. కార్యక్రమంలో తాడి నాగేశ్వరరావు, చిన్నం అర్జునుడు, మాసా రాజామణి, అనుసూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ కార్యదర్శిగా మానుకొండ

లిబరేషన్ మహాసభలో లిబరేషన్ మండల కమిటీ కార్యదర్శి మానుకొండ లచ్చబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీలో మరో 11 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు తెలిపారు.

ఉన్నతమైన సమాజం విద్యార్థుల వల్లే సాధ్యం

- న్యాయమూర్తి లీలా శ్యామ్ సుందరి



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి లీలా శ్యామ్ సుందరి

ప్రత్తిపాడు: ఉన్నతమైన సమాజ స్థాపన విద్యార్థుల వల్లే సాధ్యపడుతుందని ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ లీలా శ్యామ్ సుందరి అన్నారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో మంగళవారం సాయంత్రం జరిగిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె ప్రసంగిస్తూ సమాజాన్ని ఉన్నతమైన సమాజంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థుల విధి, విధానాలను వివరించారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను న్యాయమూర్తి లీలా శ్యామ్ సుందరి వివరించారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవి మాట్లాడుతూ 18 ఏళ్ళలోపు పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిపై ఫోక్సో చట్టం కింద రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈచట్టం బాలుర బాలికల వర్తిస్తుందన్నారు. ×గుడ్ టచ్-బ్యాడ్ టచ్×పై అవసరాల దేవి అవగాహన కల్పించారు. ఈసదస్సులో ఐలాజ్ జాతీయ నాయకుడు బుగత శివ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ప్యానెల్ అడ్వకేట్ బొంగుశూరి మధుబాబు, వసతిగృహ సంక్షేమాధికారి ఎం శైలజారాణి, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

ప్రత్తిపాడు ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని ప్రత్తిపాడు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ లీలా శ్యామ్ సుందరి తనిఖీ చేశారు. రిజిష్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతిగృహ పరిసరాలను వంటశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వసతిగృహ సిబ్బందికి సూచించారు.

బీటెక్ విద్యార్థులకు ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2025

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బిటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మంగళవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో–2025 కార్యక్రమం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో వైస్ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్య ప్రదర్శన, వాస్తవ సమస్యలను సృజనాత్మక పరిష్కారాలను ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రోవైస్ ఛాన్సలర్ అకాడమిక్ ఎస్.రమాశ్రీ పాల్గొన్నారు.